# ప్లాస్టిక్ రహితంగా కొమురవెల్లిని తీర్చిదిద్దుదాం



బట్ట బ్యాగులను ప్రదర్శిస్తున్న డీపీవో దేవకీదేవి తదితరులు

డీపీవో దేవకీదేవి

కొమురవెల్లి, డిసెంబర్ 19 : కొమురవెల్లిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని డీపీవో దేవకీదేవి అన్నారు. మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో స్వచ్ఛ కొమురవెల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లతాకిష్టయ్య అధ్యక్షతన మల్లన్న ఆలయ సమీపంలోని దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీపీవో హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలను వివరించారు. 'స్వచ్ఛ కొమురవెల్లి- స్వచ్ఛ మల్లన్న' నినాదంతో ప్లాస్టిక్ రహిత కొమురవెల్లిగా మార్చుకుందామన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా కాటన్ క్లాత్ బ్యాగులు, స్టీల్ బ్యాంకులను వాడాలని సూచించారు. కొమురవెల్లిలో ప్లాస్టిక్‌ను నిషేధించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. అనంతరం బట్ట బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిద్దప్ప, డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, మల్లన్న ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఎస్సై నాగరాజు, ఎంపీడీవో అనురాధ, స్వచ్ఛ కొమురవెల్లి ఇన్‌చార్జి మాధవి, ఎంపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి లోకేశ్ రెడ్డి, దుకాణ యజమానులు పాల్గొన్నారు.



ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 19 : గజ్వేల్ పట్టణంలో భద్రాచలం సీతారామ ఆలయ ముక్కోటి ఏకాదశి కరపత్రాలు, గోడ పత్రికలను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. లక్ష్మీప్రసన్ననగర్‌లోని రామాలయంలో రామకోటి రామరాజు ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక సమరసత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకుల నరేశ్‌బాబు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

## కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు ప్రమోషన్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 19 : సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు ప్రమోషన్ లభించింది. సెలెక్షన్ గ్రేడ్(13వ లెవెల్)గా ఐఏఎస్ అధికారిగా పదోన్నతి లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి లభించినా జిల్లా కలెక్టర్‌గా ప్రశాంత్ జీవన్ పాటిల్ కొనసాగనున్నట్లు సీఎంఓ పేర్కొన్నారు.

## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 19 : ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి సూచించారు. మేకలు, బర్రెల పెంపకం కోసం మండలంలోని అందె గ్రామానికి చెందిన శంకర్‌కు మంజూరైన రూ.5 లక్షలు, భాగవ్వకు రూ.10 లక్షల రుణాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజలింగారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగానికి తక్కువ వడ్డీలతో రుణాలను కో-ఆపరేటివ్ బ్యాంకు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక బ్యాంకు మేనేజర్ మహేందర్‌రెడ్డి, సీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

కొమురవెల్లి, డిసెంబర్ 19 : మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ ఫౌండేషన్ చైర్మన్, పార్టీ జిల్లా నాయకుడు బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గురువన్నపేటకు చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం రాజేందర్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సాయంతోపాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బుడిగె గురువయ్యగౌడ్, వైనాల పరశురాములు, బండెల సురేందర్‌రెడ్డి, బొంగు చంద్రశేఖర్, రమేశ్, మహేశ్, వెంకట్ ఉన్నారు.

## దుర్గమ్మ గుడికి జడ్పీటీసీ విరాళం

అక్కన్నపేట, డిసెంబర్ 19 : మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న దుర్గమ్మ గుడికి జడ్పీటీసీ మంగాశ్రీనివాస్ దంపతులు మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి తెలిపారు. సందర్భంగా గుడి నిర్వాణానికి సహకరించిన జడ్పీటీసీని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, చింతల మల్లారెడ్డి, పాగాల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

సిద్దిపేట, డిసెంబర్ 19 : మనిషి మదిలో దాగియున్న విషయాలను తెలుసుకోవడం కేవలం చేతిరాత ద్వారా సాధ్యమని ప్రముఖ చేతిరాత నిపుణుడు ఏజాస్అహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మర్కెజ్‌స్ హైస్కూల్‌లో చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌తోపాటు గణితంలో చక్కగా రాసేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అలరించిన నాటకం

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 19 : గజ్వేల్ మహతి ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' పేరున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని అభ్యుదయ కళామండలి కళాకారులు మంగళవారం ప్రదర్శించారు. నాటకం ద్వారా అంబేద్కర్ జీవితంలో ఎదుర్కొన్న సాంఘిక దురాచారాలు, సమాజంలోని ప్రస్తుత పరిస్థితులతో పోరాడి ఉన్నతంగా ఎదిగిన తీరును కండ్లకు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి సీహెచ్ కవిత, మాలమహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్, అధికారులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు హాజరయ్యారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్, డిసెంబర్ 19 : మండలంలోని వట్టిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ అధికారిణి తనూజ విలేకరులతో మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి వట్టిపల్లి గ్రామానికి చెందిన కేతావత్ ఇంట్లో దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా సుమారు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించి నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## నేడు జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

అక్కన్నపేట, డిసెంబర్ 19 : మండలంలోని అంతకపేటలో నేడు(బుధవారం) జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14,16,18 యూత్, మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22, 23, 24 తేదీల్లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగనాయక సాగర్ వద్ద జరిగే ఎనిమిదో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు సొంత సైకిల్, హెల్మెట్‌తో ఉదయం 9 గంటలకు అంతకపేటకు రావాల్సిందిగా సూచించారు. పూర్తి వివరాల కోసం 9441925763, 9491481828 నంబర్లను సంప్రదించాలన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా కవిత

చేర్యాల, డిసెంబర్ 19 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకురాలిగా పని చేస్తున్న ఏలూరి కవితను మంగళవారం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు బరిగెల నారాయణ, ప్రధాన కార్యదర్శి గొంటి రవి ప్రకటించారు. నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ముద్ర రుణాలు పొందండి

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 19 : కుటీర పరిశ్రమల వ్యాపారాభివృద్ధి కోసం ముద్ర రుణాలు పొందాలని హుస్నాబాద్ మెప్మా కో-ఆర్డినేటర్ ముత్యాల రాజు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఎంఎఫ్ఎమ్ ద్వారా కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు వారు రుణాలు అందిస్తామని, ఇందులో 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. తీసుకున్న రుణాలను 24 మాసాల నుంచి 5 ఏండ్ల వరకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 19 : బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మద్దూరు మండలం లద్నూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు ప్రేమలత(76) వీసా తీసుకునేందుకు హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. వీసా తీసుకుని మంగళవారం తిరిగి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై ఎక్కింది. లద్నూర్ సమీపంలో ప్రేమలత ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను జనగామ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రేమలత మృతి చెందింది.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, డిసెంబర్ 19: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బెజ్జంకి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలను సజావుగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అతిత్వరలో అమలు చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. అనంతరం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ రాములు, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# 'సమాచారం ఇవ్వకుండా కరెంట్ కట్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశంగౌడ్

జగదేవ్‌పూర్, డిసెంబర్ 19 : కరెంట్ బిల్లుల వసూళ్ల పేరుతో రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ నిలిపివేస్తున్నారని, దీంతో నారుమడులు ఎండిపోతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీపీ బాలేశంగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు కవిత, కిరణ్, మంజులామహేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, సర్పంచులు యాదవరెడ్డి, చంద్రశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 19 : ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏలు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కనకయ్య, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక మండలశాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతోపాటు ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రమోషన్లకు అర్హత అయిన టెట్‌ను మినహాయింపు లేదా క్వాలీఫై కావాడానికి నిర్ణీత గడువు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు ప్రమోషన్లు ఇచ్చి బదిలీలు చేపట్టాలన్నారు. బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పొన్నమల్ల రాములు, తిరుపతిరెడ్డి, రామస్వామి, కనకయ్య, రామచంద్రం, శంకర్, వెంకటయ్య, రాములు, అంజయ్య, లక్ష్మారెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'మల్లన్న' ఆలయ టెండర్లు ఖరారు

చేర్యాల, డిసెంబర్ 19 : కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సంబంధించిన వివిధ అంశాలపై మంగళవారం ఆలయంలో ఈవో బాలాజీ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. స్వామివారి ఆలయానికి పట్నాల బట్ట, ఓం నమఃశివాయ శెల్లాలు, జరీ శెల్లాలు, జాకెట్ పీసులకు నిర్వహించిన సీల్డ్ టెండర్లలో తక్కువ ధరలకు ఆలయానికి సరఫరా చేసేందుకు టెండర్ వేసిన వ్యక్తులకు టెండర్‌ను ఆలయ అధికారులు ఖరారు చేశారు. జరీ శెల్లాలు సరఫరా చేసే హక్కులను యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన జి.భూపాల్‌రెడ్డి, వాజిద్ హ్యాండ్‌లూమ్స్ వారికి అప్పగించారు. ఓంనమః శివాయ శెల్లాలు సరఫరా చేసే హక్కులను నాగార్జున టెక్స్‌టైల్స్ ఏజెన్సీ(తాటి అన్నారం) వారికి అప్పగించారు. పట్నాల బట్ట సరఫరా చేసే హక్కులను జి.భూపాల్‌రెడ్డి, వాజిద్ హ్యాండ్‌లూమ్స్ వారికి కేటాయించారు. జాకెట్ పీసులను సరఫరా చేసే హక్కులను వరంగల్‌కు చెందిన అనంతుల కేదారి క్లాత్ మర్చంట్స్‌కు అప్పగించారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్ పాల్గొన్నారు.